# మూడు రోజుల్లో..

**ప్రజాపాలనలో పాల్గొన్న 93,761 కుటుంబాలు**

# 86,458 దరఖాస్తులు

- దరఖాస్తుల స్వీకరణకు తహసీల్దార్లు, ఎంపీడీవోల ఆధ్వర్యంలో బృందాలు
- కొత్త రేషన్ కార్డులతోపాటు ఇందిరమ్మ ఇండ్ల పథకం, గృహజ్యోతి పథకానికి అత్యధిక దరఖాస్తులు
- కొత్త రేషన్ కార్డులను త్వరలో జారీ చేసే యోచనలో ప్రభుత్వం
- ఇప్పటివరకు 262 గ్రామపంచాయతీలు, 41 వార్డుల్లో దరఖాస్తుల స్వీకరణ పూర్తి


మర్పల్లి : పెద్దాపూర్‌లో అధికారులకు దరఖాస్తులను అందిస్తున్న గ్రామస్తులు (ఫైల్)

వికారాబాద్, జనవరి 1 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు చేపట్టిన కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తున్నది. అభయహస్తం పథకాల్లో భాగంగా మహాలక్ష్మి, గృహజ్యోతి, రైతు భరోసా, చేయూత, ఇందిరమ్మ ఇండ్ల పథకాలను అమలు చేసేందుకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను డిసెంబర్ 28 నుంచి చేపట్టారు. అభయ హస్తం పథకాలను అమలు చేసేందుకు తెల్లరేషన్ కార్డు తప్పనిసరి కావడం, చాలా మందికి తెల్ల రేషన్‌కార్డులు లేకపోవడంతో వాటి కోసమే అధిక మొత్తంలో ప్రజలు దరఖాస్తు చేసుకుంటున్నారు. తెల్ల రేషన్ కార్డులు లేని వారికి త్వరలో జారీ చేసేందుకు ప్రభుత్వం యోచిస్తున్నది. ప్రజాపాలన దరఖాస్తుల్లో రేషన్ కార్డు నెంబర్ వద్ద లేదని పూర్తి చేయడం లేదా ప్రత్యేకంగా తెల్ల రేషన్ కార్డుల జారీ కోసం దరఖాస్తులను ప్రజాపాలనలో భాగంగా అందజేయాలని అధికారులు సూచిస్తున్నారు. తెల్ల రేషన్ కార్డులతోపాటు ఇందిరమ్మ ఇండ్ల పథకం, గృహజ్యోతి పథకానికి అధిక మొత్తంలో దరఖాస్తు చేసుకుంటుండడం గమనార్హం. ఎవరైనా దరఖాస్తులు ఇవ్వనట్లయితే సంబంధిత మండల ఎంపీడీవో కార్యాలయంలోగాని, మున్సిపాలిటీల్లోని ప్రజలు అయితే సంబంధిత మున్సిపాలిటీ కార్యాలయంలోగాని దరఖాస్తులను అందజేయవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

## రోజుకు రెండు గ్రామాల్లో..

ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు చేపట్టిన ప్రజాపాలనలో భారీగా దరఖాస్తు చేసుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా మూడు రోజుల్లో 87,458 దరఖాస్తులు వచ్చాయి. డిసెంబర్ 28న ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కాగా మొదటి రోజు 19,865 దరఖాస్తులు రాగా.. రెండో రోజు 26,913., మూడో రోజు 40,680 దరఖాస్తులు వచ్చాయి. తాండూరు నియోజకవర్గంలో 27,175 దరఖాస్తులు, వికారాబాద్‌లో 24,727., పరిగిలో 19,988., కొడంగల్‌లో 12,767., చేవెళ్ల నియోజకవర్గంలోని నవాబుపేట్ మండలంలో 2,801 దరఖాస్తులు వచ్చాయి. మరోవైపు మూడు రోజుల్లో జిల్లాలోని 262 గ్రామపంచాయతీల్లో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పూర్తికాగా.. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీల్లోని 41 వార్డుల్లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పూర్తయ్యింది. రెండు రోజుల్లో ప్రజాపాలన కార్యక్రమంలో 93,765 కుటుంబాలు పాల్గొన్నాయి. ఈ నెల 8 వరకు ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించనున్నారు. గ్రామాల్లో, మున్సిపాలిటీల్లోని వార్డుల్లో గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణకు రెవెన్యూ అధికారితోపాటు వ్యవసాయ, విద్య, వైద్య, విద్యుత్తు, పౌరసరఫరాల శాఖల అధికారులతో ఎంపీడీవోలు, తహసీల్దార్ల బృందాలను ఏర్పాటు చేశారు. రోజుకు రెండు గ్రామాల్లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పూర్తి చేస్తున్నారు.

### తెల్ల రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చు



తెల్ల రేషన్ కార్డు కోసం ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా దరఖాస్తు చేసుకోవచ్చు. త్వరలో ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డులను జారీ చేస్తుంది. ఎవరూ కూడా ప్రజాపాలన దరఖాస్తులను విక్రయించవద్దు. దరఖాస్తులను విక్రయిస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటాం. గ్రామపంచాయతీలు, వార్డుల్లో దరఖాస్తు చేసుకోలేనివారు దరఖాస్తును పూర్తి చేసి సంబంధిత మండల, మున్సిపాలిటీ కార్యాలయాల్లో అందజేయవచ్చు.

- కలెక్టర్ నారాయణరెడ్డి


కడ్తాల్ : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావును సోమవారం మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, తలకొండపల్లి జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## థర్టీ ఫస్ట్‌కు 4.8లక్షల బిర్యానీలు

**గ్రేటర్‌లో రికార్డు స్థాయిలో ఆన్‌లైన్ ఆర్డర్లు.. వెల్లడించిన స్విగ్గీ**

సిటీబ్యూరో, జనవరి 1(నమస్తే తెలంగాణ) ః గ్రేటర్‌లో డిసెంబర్ థర్టీ ఫస్ట్ వేడుకలు జోరుగా చేసుకున్నారు. నచ్చినంత మద్యం సేవించడంతోపాటు నచ్చినవారితో కలిసి కావాల్సిన దానికంటే ఎక్కువ బిర్యానీలను లాగించేశారు. దీంతో స్విగ్గీలో ఒక్క డిసెంబర్ 31 వేడుకల ఆర్డర్లు గత రికార్డులను తిరగరాసేలా బిర్యానీ అమ్మకాలు జరిగాయి. కొత్త సంవత్సరం వేడుకలకు స్వాగతం పలుకుతూ నగరవాసులు ఏకంగా 4.8లక్షల బిర్యానీలను ఆర్డర్ చేశారు. స్విగ్గీ వెల్లడించిన నివేదిక ప్రకారం నిమిషానికి 1244 బిర్యానీలను విక్రయించినట్లుగా తేలింది. గతంలో కంటే 1.6 రేట్లు ఆర్డర్లను అందుకున్నామని, వరల్డ్ కప్ – 2023 ఫైనల్ సందర్భంగా ఈ తరహా ఆర్డర్లు వచ్చినా... అప్పుడు వచ్చిన దాని కంటే 1.3లక్షల ఆర్డర్లు ఎక్కువగా ఉన్నాయని స్విగ్గీ పేర్కొంది. పాత సంత్సరానికి వీడ్కోలు చెబుతూ, నూతన ఏడాదికి స్వాగతం పలికేందుకు చివరి గంటలో మిలియన్ల మంది యాక్టివ్ యూజర్లు ఉన్నారని, దేశవ్యాప్తంగా పది లక్షల మంది ఆర్డర్ చేశారని తెలిపారు. అయితే దేశవ్యాప్తంగా నిమిషానికి 1722 కండోమ్‌లను ఆర్డర్ చేయగా, వీటిని స్విగ్గీ ఇన్‌స్టా మార్ట్ ద్వారా డెలివరీ చేసినట్లుగా స్విగ్గీ పేర్కొంది.



## ఎస్‌సీఆర్‌లో నాలుగు వందేభారత్‌లకు పూర్తి ఆదరణ

సిటీబ్యూరో, జనవరి 1 (నమస్తే తెలంగాణ) : దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో గత ఏడాదిలో ప్రవేశపెట్టిన నాలుగు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ప్రయాణికుల నుంచి మంచి ఆదరణ లభిస్తున్నట్లు జోన్ రైల్వే అధికారులు తెలిపారు. డిసెంబర్ 2023లో 100 శాతం కంటే ఎక్కువ ప్రోత్సాహాన్ని నమోదు చేయడంతో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు రైల్వే జోన్ అంతటా విశేష గుర్తింపు పొందింది. దీనికి అదనంగా ఎస్‌సీఆర్ ఆధ్వర్యంలో జల్నా నుంచి ముంబై సీఎస్‌టీఎం వరకు మరో వందే భారత్‌ను ప్రవేశపెట్టింది. ఈ మార్గంలో కొత్తగా ప్రవేశపెట్టిన రైలు సోమవారం నుంచి బయలుదేరినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం సికింద్రాబాద్–విశాఖపట్నం వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో 16 కోచ్‌లలో 100 శాతం కంటే ఎక్కువ ఆక్యుపెన్సీ స్థిరంగా నడుస్తున్నదన్నారు. ముఖ్యంగా గత ఏడాదిలో సికింద్రాబాద్–విశాఖపట్నం ఆక్యుపెన్సీ 134 శాతం ఉండగా, విశాఖపట్నం–సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌లో 143 శాతం ఉన్నట్లు తెలిపారు. సికింద్రాబాద్–తిరుపతి మధ్యలో ఎనిమిది కోచ్‌లతో కూడా ఆక్యుపెన్సీ స్థిరంగా కొనసాగుతున్నదన్నారు. ఈ మార్గంలో గత ఏడాది మే నుంచి 16 కోచ్‌లు పెంచినప్పటికీ ఆ మార్గంలో గత డిసెంబర్‌లో 105 శాతం ఆక్యుపెన్సీ నమోదైనట్లు రైల్వే అధికారులు తెలిపారు. కాచిగూడ–యశ్వంత్‌పూర్ మధ్య 8 బోగీలతో నడుస్తున్న వందేభారత్‌కు డిసెంబర్‌లో 107 శాతం ఆక్యుపెన్సీ కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. యశ్వంత్‌పూర్ –కాచిగూడ మధ్యలో 110 శాతం ఆక్యుపెన్సీ నమోదైందన్నారు. డిసెంబర్‌లో విజయవాడ– చెన్నై–వందేభారత్ స్టేషన్ల మధ్య 126 శాతం, చెన్నై–విజయవాడ మధ్యలో 119 శాతంగా నమోదైనట్లు అధికారులు వివరాలు వెల్లడించారు.

# తాగారు.. చిక్కారు

- గ్రేటర్‌లో పట్టుబడ్డ మందుబాబులు 3 వేల మంది
- కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు
- మద్యం మత్తులో ఓ వ్యక్తికి టక్కరిచ్చిన కానిస్టేబుల్.. మరణానికి కారకుడైన అతడిని పోలీసులకు అప్పగించిన పోలీసులు
- చల్లని బిర్యానీ.. ఉడకని ముక్కలంటూ అబిడ్స్‌లో ఘర్షణ


గోషామహల్ ట్రాఫిక్ ఇన్‌స్టిట్యూట్‌లో మందుబాబులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

సిటీబ్యూరో, జనవరి 1 (నమస్తే తెలంగాణ) : కొత్త సంవత్సరం వేడుకల్లో భారీగా మందుబాబులు పట్టుబడ్డారు. మరో పక్క సైబరాబాద్‌లో మద్యం మత్తులో ఒక కానిస్టేబుల్ బైక్ నడుపుతూ రోడ్డు ప్రమాదం చేసి ఓ వ్యక్తి మరణానికి కారకుడయ్యాడు. హైదరాబాద్‌లో హోటల్‌లో బిర్యానీలో ముక్కలు రాలేదని, చల్లగా ఉందంటూ ప్రశ్నించిన పాపానికి హోటల్‌లో పనిచేసే సిబ్బంది యజమాన్యంతో కలిసి కస్టమర్లను చితకబాదారు. వీటితోపాటు ట్రై కమిషనరేట్ల పరిధిలో అక్కడక్కడ చిన్నచిన్న గొడవలు, ప్రమాదాలు మినహా న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరిగాయి. న్యూ ఇయర్ వేడుకలకు భారీ ఎత్తున డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తామంటూ మూడు రోజుల ముందు నుంచే హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ ట్రై పోలీస్ కమిషనర్లు శ్రీనివాస్‌రెడ్డి, అవినాష్ మహంతి, సుధీర్‌బాబు హెచ్చరిస్తూ వచ్చారు. అయినా మందుబాబులు న్యూ ఇయర్ వేడుకల్లో మందులో మునిగి తేలి అడ్డంగా దొరికిపోయారు. ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో 3 వేల డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. కేసులు నమోదైనవారు 1న ఉదయం హైదరాబాద్‌లోని గోషామహల్ ట్రాఫిక్ శిక్షణ కేంద్రానికి కౌన్సెలింగ్‌కు తరలివెళ్లారు.

### అడుగడుగునా డ్రంక్ అండ్ డ్రైవ్

ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో రోడ్డు ప్రమాదాలు జరుగకుండా కట్టడి చేసేందుకు పోలీసులు పటిష్ట చర్యలు తీసుకున్నారు. అయినా అక్కడక్కడ ప్రమాదాలు జరిగాయి. ప్రతి ట్రాఫిక్ ఠాణా పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ ఒకటి రెండు చోట్ల తప్పని సరిగా నిర్వహించేలా పోలీసులు చర్యలు తీసుకున్నారు. అయినా చాలా మంది మందుబాబులు మందు తాగి రోడ్లపై చిందులు వేస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. కూకట్‌పల్లిలో ఎస్‌ఆర్‌నగర్ ఠాణాలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మల్లికార్జున్ మద్యం మత్తులో ద్విచక్రవాహనాన్ని నడుపుతూ కేఎల్‌ఎం బట్టల షాప్‌లో పనిచేసే దుర్గయ్య(58)ను ఢీకొట్టడంతో మృతి చెందాడు. స్థానికులు అతడిని పోలీసులకు అప్పగించారు. మరో పక్క అబిడ్స్‌లో దూల్‌పేట్‌కు చెందిన సుమిత్‌సింగ్ మరో ఏడుగురితో కలిసి గ్రాండ్ హోటల్‌లో రాత్రి భోజనానికి వచ్చాడు. వివిధ వంటకాలను అర్డర్ చేశారు. అందులో మటన్ బిర్యానీ చల్లగా ఉందని.. సరిగ్గా ఉడకలేదంటూ వెయిటర్‌కు చెప్పారు. వెయిటర్ దానిని వేడి చేసి తిరిగి తెచ్చాడు. బిర్యానీ సరిగ్గా లేదని.. దీనికి తాము బిల్లు చెల్లించబోమంటూ దూల్‌పేట్ వాసులు చెప్పారు. బిల్లు కౌంటర్ వద్దకు వచ్చిన తరువాత కూడా మటన్ బిర్యానీ బిల్లుపై వాగ్వాదం జరిగింది. దీంతో హోటల్‌లో పనిచేసే సర్వర్లు, ఇతర పనివాళ్లు దూల్‌పేట్ వాసులను చితకబాదారు. హోటల్ యజమానితో పాటు దాడికి పాల్పడిన వారిపై అబిడ్స్ పోలీసులు కేసు నమోదు చేసి 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. దీనిపై స్థానిక గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ స్పందించి హోటల్ యజమానిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### డ్రంక్ అండ్ డ్రైవ్‌లో..

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారిలో 20 ఏండ్ల నుంచి 30 ఏండ్ల మధ్య ఉన్నవారు 1400 మందికిపైగా ఉన్నారు. ఇందులో సైబరాబాద్‌లో 18 మందికి బీఏసీ కౌంట్ 500 ఎంజీపైగా వచ్చిందని పోలీసులు వెల్లడించారు.

**కమిషనరేట్లవారీగా పట్టుబడిన మద్యంబాబులు**

| పోలీసు కమిషనరేట్ | నమోదైన కేసులు | మహిళలు | పురుషులు |
|---|---|---|---|
| హైదరాబాద్ | 1243 | 2 | 1239 |
| సైబరాబాద్ | 1241 | 2 | 1241 |
| రాచకొండ | 517 | | 517 |